సమస్యను పోలీసులకు వివరిస్తున్న సంజీవ్‌నగర్ కాలనీవాసులు

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

సంగారెడ్డి, మే 28: జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. మంగళవారం పట్టణానికి చెందిన ఇస్మాయిల్ తనకు పూర్తి హక్కులు ఉన్నాయని సంజీవ్‌నగర్ కాలనీకి సంబంధించిన స్థలాన్ని జేసీబీతో సహాయంతో చదును చేసేందుకు అక్కడి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు అడ్డుకొని వాపసు పంపించారు. పట్టణ నడిబొడ్డులో అకోలా-నాందేడ్ ప్రధాన రహదారికి పక్కన దాదాపు 800గజాల స్థలాన్ని ఒకరి పేరుతో యజమానిని సృష్టించి జీపీఏ అగ్రిమెంట్ చేసుకొని స్థలాన్ని చదును చేసేందుకు యత్నించాడు. ఈ స్థలం కాలనీకి చెందిందని, ఎవరికీ హక్కులు లేవని కాలనీవాసులు అతడితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై పట్టణ పోలీసులకు కౌన్సిలర్ ఫిర్యాదు చేయగా పోలీసులు ఇక్కడికి చేరుకొని ఇరు వర్గాలను పట్టణ స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లారు. అనంతరం కాలనీకి చెందిన వృద్ధులు, మహిళలు భారీ సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు తరలివెళ్లారు. ఇరువర్గాల వాదనలు విన్న ఇన్‌స్పెక్టర్ కలెక్టర్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



జిన్నారం: ఊట్ల అయ్యప్పను దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, తదితరులు

జిన్నారం, మే 28: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం ఊట్ల గ్రామంలోని అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, స్థానిక నాయకులతో కలిసి అయ్యప్పను దర్శించుకున్నారు. అనంతరం సోలక్‌పల్లిలోని గణపతి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు కొద్దిసేపు దైవారాధన చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఊట్ల మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సోలక్‌పల్లి బీఆర్ఎస్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి సునీతారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కొడకంచి మాజీ సర్పంచ్ శివరాజ్, జింకల శ్రీనివాస్, జహంగీర్‌రెడ్డి, ఆనంద్, మంద రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలుగుపోచమ్మ ఆలయంలో పూజలు

హత్నూర, మే 28: హత్నూర మండలం శేర్కాన్‌పల్లి శివారులోని పలుగు పోచమ్మ ఆలయంలో మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు పూజారులు శ్రీకాంత్‌చారి, రాజు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ వారి కృపతో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. అక్కడినుంచి సాయంత్రం దౌల్తాబాద్‌లో జరిగిన రేణుక ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొని బోనమెత్తుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీనర్సింహులు, నాయకులు నర్సింహారెడ్డి, రాంచంద్రారెడ్డి, రమేశ్, ఆగమయ్య, లక్ష్మీనారాయణ, విఠల్, మహేశ్ గౌడ్, రామకృష్ణ, సంతోష్‌కుమార్, వెంకటేశ్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, అజిమతల్లి పాల్గొన్నారు.

హత్నూర: నెత్తిన బోనంతో ఎమ్మెల్యే

ఫైనల్‌కు చేరిన మెదక్ జట్టు

ఫైనల్‌కి చేరుకున్న మెదక్ జట్టు

నేడు ఉప్పల్ స్టేడియంలో ఫైనల్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 28: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీ-20 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు తిరుగులేని విజయాలు సొంతమవుతున్నాయి. ఆది నుంచి ఇప్పటివరకు ఓటమి ఎరుగని మెదక్ జట్టు మంగళవారం జరిగిన సెమీఫైనల్‌లో 53 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన సెమీఫైనల్‌లో టాస్ గెలిచిన మెదక్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. మెదక్ జిల్లా జట్టు నిర్ధారిత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. కె.శ్రీధర్ 39, అర్చాజ్ 32, అఫ్రిదీ 32 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు 17.4 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 87 పరుగులు మాత్రమే చేసింది. మెదక్ జట్టు బౌలింగ్‌లో హిశాంత్ 4 వికెట్లు, అర్చాజ్ 3 వికెట్లు తీశారు. 53 పరుగుల తేడాతో సెమీ ఫైనల్స్‌లో విజయం సాధించిన మెదక్ జట్టు ఈ నెల 29న బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఫైనల్‌లో తలపడనున్నట్టు మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు.

డాకూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో బాలరాజు

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

అందోల్, మే 28: నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని అదనపు డీఆర్డీవో బాలరాజు నర్సరీ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని డాకూర్ నర్సరీలో మొక్కలను పరిశీలించారు. అనంతరం ఉపాధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు సరిగా నిర్వహించాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. కూలీల డబ్బులు సైతం సకాలంలో వారి ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోహీర్, మే 28: జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8గంటల నుంచి 11.30వరకు విద్యుత్ సరఫరా నలిపివేస్తామని ఏఏఈ నాగరాజు తెలిపారు. 33/11కేవీ సబ్ స్టేషన్ నుంచి 11కేవీ 3, 11కేవీ 4 ఫీడర్లపై ఉన్న చెట్ల కొమ్మలను నరికేందుకు విద్యుత్ సిబ్బందికి అనుమతించామన్నారు. పూకట్‌నగర్, వెంకటరమణ కాలనీ, శాంతినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఐడీఎస్ఎంటీ, షాహీన్‌నగర్, రాంనగర్, హమాలీనగర్, కాంతారెడ్డి కాలనీ, ఫరీద్‌నగర్, గాంధీనగర్, గుల్షన్నగర్, మక్బుల్‌నగర్, జమాలీ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. బాగారెడ్డిపల్లి, జేసీ బ్రదర్స్ రోడ్, ఏరియా దవాఖాన, ఎన్జీవోస్ కాలనీ, తహసీల్ కార్యాలయ ఏరియా, విద్యుత్ కాలనీ, ఎస్బీహెచ్ కాలనీ, బ్లాక్ రోడ్, సుభాశ్ గంజ్, స్టేడియం పరిసరాలు, ఎస్టీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, రైల్వే స్టేషన్, కోర్టు పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సదాశివపేటలో..

సదాశివపేట, మే 28: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. పట్టణంలోని రాఘవేంద్రనగర్, శక్తినగర్, జీటీఆర్ వెంచర్, అయ్యప్ప టెంపుల్, దత్తాత్రేయనగర్, పీఎస్ఎంఎల్, గరునగర్‌కాలనీ, సదాశివ ఎస్టేట్, ఆర్ఎంహెచ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్, మే 28: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. ప్రజలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 99592 23170 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పనుల పరిశీలన

సదాశివపేట, మే 28: మండల పరిధిలోని గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంఈవో అంజయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని, అప్పటివరకు పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. మండలంలోని 45 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలకు 57 పనులకు రూ.1.56 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి కల్యాణం

అందోల్, మే 28: అందోల్‌లోని భూనీల రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కుతురు, అల్లుడితో కలిసి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు, పురోహితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.



రంగనాథస్వామి కల్యాణంలో మంత్రి దామోదర రాజనర్సింహ

కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయడం లేదు

అందోల్, మే 28: పొలాల వద్దకు విద్యుత్ స్తంభాల కోసం డీడీలు కట్టినా అధికారులు స్తంభాలు ఏర్పాటు చేయడం లేదని మండలంలోని చందంపేట్ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకుల ముందు గోడును వెల్లబోసుకున్నారు. చందంపేట్ గ్రామానికి చెందిన రైతు మంగళ లక్ష్మయ్యతోపాటు మరికొంత మంది రైతులు పొలాల వద్దకు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సంబంధిత అధికారులకు డీడీలు అందజేసినట్లు వివరించారు. కానీ, అధికారులు ఇప్పటివరకు స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో కర్రలపై వైర్లను ఏర్పాటు చేసుకున్నామని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సి వస్తుందని వాపోయారు. ఫోరంఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్తంభాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వైకుంఠధామాలను వినియోగంలోకి తేవాలి

కంగ్టి, మే 28: గ్రామాల్లో వైకుంఠధామాలను వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. మంగళవారం కంగ్టి మండలంలోని రాంతీర్థ్ గ్రామంలో క్రీడాప్రాంగణం, వైకుంఠధామం, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. చాలా గ్రామాల్లో వైకుంఠధామాలు నిరుపయోగంగా ఉన్నాయని, వెంటనే వినియోగంలోకి తేవాలని ఎంపీడీవోకు సూచించారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డీఎల్పీవో సంజీవ్‌రావు, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లోకికుమార్ ఉన్నారు.

జనము విత్తనాలు పంపిణీ

ఖాదిరాబాద్‌లో జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారి మహేశ్‌చౌహాన్

వట్‌పల్లి, మే 28: మండల పరిధిలోని ఖాదిరాబాద్‌లో మంగళవారం రైతులకు మండల వ్యవసాయ అధికారి మహేశ్‌చౌహాన్ జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున రైతులకు 30కిలోల జనుము విత్తనాల బస్తా ధర రూ.1,448గా నిర్ణయించి అందజేశామన్నారు. జనుము విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు పరిమిళ, బాగేశ్, ప్యాక్స్ సీఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

బస్తాకు రూ.3 ఇస్తేనే తరలిస్తుండ్రు

చౌటకూర్, మే 28: మండలంలోని ఉప్పరిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తాకు రూ.3 ఇస్తేనే మిల్లులకు తరలిస్తామని లారీ డ్రైవర్లు చెప్పడంతో ఖంగు తిన్న రైతులు సోమవారం ఐకేపీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతున్నారు. ఉప్పరిగూడెంలో బస్తాకు రూ.3 వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉప్పరిగూడెంలో అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్న రైతులు

మా ప్లాట్లను కాపాడండి

పటాన్‌చెరు, మే 28: మా ప్లాట్లను కబ్జా చేసి ఇండ్లు నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారికి మున్సిపాలిటీ అధికారులు ఓపెన్ ప్లాట్స్‌కి ఇంటి నంబర్ ఇచ్చి తప్పుగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ క్రాంతి వల్లూరుకు ప్లాట్ల బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితులు అనంతలక్ష్మి, వినోద్ సింగ్, విజయ్‌కుమార్ మంగళవారం వివరాలు తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 847లో 1985లో ప్లాట్లు కొన్నామని, ప్లాట్ నంబర్ 436, 437, 438, 439లను కొనుగోలు చేశారు. ఈ ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని గుర్తించి కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని వాపోయారు. ఈ వ్యవహారాన్ని అడ్డుకొని కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. మున్సిపల్ అధికారులు తమ ఓపెన్ ప్లాట్లకు వేరే వ్యక్తుల పేరున ఇంటి నంబర్ కేటాయించారని ఆరోపించారు.

నిర్మాణం కంటే ముందే ఇంటి నంబర్లు ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. స్వరూప రాణి అనే వ్యక్తికి బిల్డింగ్ నిర్మించుకునేందుకు పర్మిషన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. కోర్టు కేసులో ఉన్న స్థలంలో నిర్మాణాలకు ఏకపక్షంగా పర్మిషన్లు ఇవ్వడం దారుణమన్నారు. మున్సిపాలిటీ నుంచి ఎలాంటి డాక్యుమెంట్లు పరిశీలించకుండానే పర్మిషన్లు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన తప్పుడు పర్మిషన్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామని బాధితులు చెప్పారు. తమ ప్లాట్లు ఇప్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారిస్తామని కలెక్టర్ తెలిపారని చెప్పారు.

వీధి కుక్కల కట్టడికి చర్యలు

రామచంద్రాపురం, మే 28: తెల్లాపూర్‌లో 24గంటల వ్యవధిలో వీధి కుక్క దాడిలో పలువురు గాయడిన విషయం తెలిసిందే. 8, 9, 10 వార్డుల్లో వీధి కుక్క దాడికి పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి బల్లియా అధికారుల సహకారంతో తెల్లాపూర్‌కు ఏబీసీ కుక్కల జనన నియంత్రణ యూనిట్ వ్యాన్‌ని రప్పించి 18 కుక్కలను పట్టుకొని వ్యాక్సిన్ వేసి జనన నియంత్రణ వ్యాన్‌లో పంపించారు. వీధి కుక్కలకు దశలవారీగా వ్యాక్సినేషన్ చేస్తామన్నారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భరత్‌కుమార్, మంజుల, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలు

హత్నూర, మే 28: మండల కేంద్రమైన హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల(బాలుర)లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ గ్రూపులో ఖాళీలు ఉన్నందున ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సంస్థ వెబ్‌సైట్‌లో రూ.100 ఫీజు చెల్లించి ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జొన్నల కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

రాయికోడ్, మే 28: జొన్నల కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని రాయికోడ్ వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏ సత్యానారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన జొన్నలను త్వరితగతిన తరలించాలన్నారు.

బ్యాటరీ దొంగల హల్‌చల్

బ్యాటరీలు చోరీ చేసి యాక్టీవాపై వెళ్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యం

జిన్నారం, మే 28: గడ్డపోతారం పారిశ్రామిక పంచాయతీలో బ్యాటరీ దొంగలు సోమవారం రాత్రి హల్‌చల్ చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కిష్టయ్యపల్లి గ్రామంలో ట్యాంకర్, ట్రాక్టర్ బ్యాటరీలను దొంగతనం చేశారు. వీటికి సంబంధించిన వీడియోలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బ్యాటరీలను దొంగతనం చేసి యాక్టీవాపై వెళ్తుండగా గుర్తించిన గ్రామస్తులు ఆ ఇద్దరు దొంగలను పట్టుకునేందుకు వెంబడించారు. బొల్లారం వైపు వెళ్తుండగా దొరికిపోయే సమయంలో యాక్టీవాను వదిలి ఆ ఇద్దరు దొంగలు పొదల్లోకి పరుగులు పెట్టారు. గ్రామస్తులు 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు యాక్టీవాను స్టేషన్‌కు తరలించారు. వారం క్రితం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమ వద్ద నిలిపిన పన్నెండు వాహనాల బ్యాటరీలు చోరీ అయ్యాయని బాధితులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

అమీన్‌పూర్, మే 28: మద్యం మత్తులో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కారులోనే మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. తండ్రి రాజయ్య, భార్య వైష్ణవి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి అనురాగ్ అపార్ట్‌మెంట్‌లో నివసించే నిజామాబాద్ పట్టణానికి చెందిన పవన్‌కుమార్(45) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. భార్య ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పవన్ కుమార్ తన కియా కారులో బయటకు వెళ్లాడు. అమీన్‌పూర్ పీజేఆర్ కాలనీ మెయిన్ రోడ్డు పక్కన ఓ షాపు ఎదుట కారులో అనుమానాస్పదంగా మృతి చెందాడు. పవన్ కుమార్ అధికంగా మద్యం సేవించేవాడని, వారం రోజులుగా తాగుతూ ఐడీ కార్డులు, క్రెడిట్, డెబిట్ కార్డులు పోగొట్టుకున్నాడని భార్య తెలిపింది. తన వద్ద నుంచి రూ.500 తీసుకొని వెళ్లాడని చెప్పింది. స్థానికుల సహాయంతో పవన్‌కుమార్ మృతదేహాన్ని నిజామాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతురిని చూడడానికి వచ్చి అనంతలోకాలకు..

కల్హేర్, మే 28: కూతురిని చూడడానికి అత్తగారింటికి వచ్చిన తండ్రి ఆకస్మికంగా మృతి చెందిన ఘటన నాగ్‌దార్ గ్రామంలో చోటు చేసుకుంది. కల్హేర్ ఏఎస్సై జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట మండలం అక్షన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీధర్(25)తో నాగ్‌దార్ గ్రామానికి చెందిన సావిత్రికి రెండేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇటీవల కూతురు జన్మించింది. కూతురిని చూసేందుకు శ్రీధర్ రెండు రోజుల క్రితం అత్తగారింటికి వచ్చాడు. మంగళవారం తిరిగి ఇంటికి బయలుదేరే క్రమంలో చాతిలో నొప్పి వచ్చి ఆకస్మికంగా కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ



బడంపేటలో కేసు విచారణ చేస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కోహీర్, మే 28: మండలంలోని బడంపేట గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై మంగళవారం జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. మైనర్ అయిన తన కుమారుడి వివాహం విషయంలో గ్రామస్తుల చేతిలో గాయపడి ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందిన బేగరి నర్సింహులు ఇంటిని సందర్శించారు. అతడి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తుల నుంచి వివరాలను సేకరించారు. దర్యాప్తు చేస్తున్నామన్నారు. డీఎస్పీ వెంట జహీరాబాద్ పట్టణ సీఐ రవి, ఎస్సై కృష్ణయ్య, ఆర్ఐ సత్యనారాయణ ఉన్నారు.

ప్రేమ విఫలమై ఆత్మహత్య

వెంకట్(ఫైల్)

కోహీర్, మే 28: ప్రేమ విఫలమైందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జహీరాబాద్ మండలంలోని ఆనెగుంట గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. జహీరాబాద్ రూరల్ ఎస్సై ప్రసాద్‌రావు కథనం ప్రకారం.. ఆనెగుంట గ్రామానికి చెందిన పెద్దగొల్ల వెంకట్(30) నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన యువతితో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య కొంతకాలం చాటింగ్ కొనసాగింది. అనంతరం ప్రేమగా మారింది. కానీ ఆమె వివాహానికి ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన వెంకట్ మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

చౌటకూర్, మే 28: బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శివంపేట శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోడూర్ గ్రామానికి చెందిన మంగలి వీరేశం(45) పని నిమిత్తం ముత్తంగి వెళ్లాడు. అదే రోజు రాత్రి స్వగ్రామమైన కోడూర్‌కు వస్తున్న క్రమంలో శివంపేట గ్రామ సమీపానికి రాగానే బైక్ అదుపు తప్పింది. దీంతో వీరేశానికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రామచంద్రాపురం, మే 28: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను కొల్లూర్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌సీసీ అర్బన్ అపార్ట్‌మెంట్స్‌లో ఓ వ్యక్తి 18వ తేదీన ఒక ఫ్లాట్‌ని రెంట్‌కి తీసుకొని పేకాట నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు, కొల్లూర్ పోలీసులు సంయుక్తంగా పేకాట స్థావరంపై రైడ్ చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,30,000 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రవీందర్ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

వట్‌పల్లి, మే 28: అక్రమంగా తరలిస్తున్న 10 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సంగారెడ్డి సివిల్ సప్లయ్ అధికారి సాయి తెలిపారు. వట్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో అటుగా వస్తున్న డీసీఎంను తనిఖీ చేశారు. అక్రమంగా తరలిస్తున్న 205 బియ్యం బస్తాలను పట్టుకున్నారు. డీసీఎం డ్రైవర్ మహ్మద్ ఫయాజ్, డీసీఎం ఓనర్ మహ్మద్ ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

అందోల్, మే 28: రైతులు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయరత్న అన్నారు. మంగళవారం మండలంలోని రోళ్లపాడ్, మన్సాన్‌పల్లి, పోసానిపేట్, కన్సాన్‌పల్లి, కొడెకల్, నాధులాపూర్ తదితర గ్రామాల్లో రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణంలోనే ఎరువులు, విత్తనాలు కొని రసీదులు పొందాలన్నారు.



అందోల్: రైతులతో మాట్లాడుతున్న ఏవో విజయరత్న

రాయికోడ్: ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారుల తనిఖ